అందుచేత అవి మనకు హెచ్చుఖరీదు. మన ఆర్థిక స్థితినిబట్టి చూస్తే చిత్రనిర్మాణవ్యయం ఎంత తక్కువలోఉన్నా మనకు ఎక్కువే. కామెరాలూ, సౌండ్ రికార్డింగ్ యంత్రాలూ, ముడి ఫిలిమూ మనదేశంలోనే తయారవుతున్న పక్షంలో కళాదృష్టి ప్రధానంగా పెట్టుకుని చిత్రాలు తీయటం ఇంతకంటె సులభసాధ్యమై ఉండేది.

మన చిత్రనిర్మాతలు కళాదృష్టి అవలంబించక పోవటానికి ఇంతకంటె ప్రబలమైన కారణం మరొకటిఉంది. అదేమంటే. సినిమాకళలు అనుబంధ కళలుగా ఉండేవి ఏవీ సినిమాలు పుట్టే నాటికి ప్రజలకు సన్నిహితంగా లేకపోవటం. సాహిత్యం, సంగీతం, ఫొటోగ్రఫీ, నృత్యం, చిత్రలేఖనం మొదలైనవి ఈ దేశంలో ప్రజలకు బొత్తిగా పరిచయంలేని కళలు. ఈ కళలయొక్క ఉత్తమలక్షణాలను ఆశ్రయించటానికి సినిమాలు పూనుకున్నట్టయితే సినిమాల గతిఇంతే అయి ఉండేది. అటువంటి పరిస్థితులలో నిర్మాతలు ఈ వివిధకళలను ప్రజలకు దగ్గరగా తీసుకురావటానికి అవలంబించవలసిన మార్గాలు అవలంబించారు. మననిర్మాతలు ఇంకేమీ అనలేకపోయినా, సంగీతాన్నీ, కథనాన్నీ, ఇతరకళలనూ చిత్రాలద్వారా ప్రజల అనుభూతికి అనుకూలంగా చేశామని గుండెమీద చెయ్యివేసుకుని చెప్పగలస్థితిలో ఉన్నారు.

ఈ కళలను నిజంగా ప్రజలపరం చెయ్యటానికి— అంటే వీటిద్వారా మహోన్నత సాంఘిక చైతన్యమూ, ప్రయోజనమూ సాధించటానికి— నిర్మాతలు యత్నించలేదు. ఎవరన్నా యత్నించి ఉంటే వారికి సెన్సార్ నిబంధనలు తప్పక అడ్డు తగులుతాయని మనం ఊహించవచ్చు. మన ప్రభుత్వం అమలు చేసే సెన్సార్ నియమాలు కళాస్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించేవి ఎంతమాత్రమూ కావు.

ఈవిధంగా మన సినిమాలు ఇటు వ్యాపారంగానూ, అటు కళగానూ పరిణామం చెందలేక త్రిశంకు స్వర్గం చేరుకున్నాయి.

స్కెచ్

# గోపాలం రూపాయి

విశ్వమిత్ర

పర్సులోవున్న చిల్లర్నంతా బల్లమీదపోసి, అందులో రూపాయి కాసులని వేరే ఏరిపెడుతూ, వాటిఅక్షరాలవంక పరీక్షగాచూస్తున్న మావయ్యనిచూడగానే గోపాలానికి అనుమానం వేసింది. ఏర్చటం అంతా ఐనతర్వాత గోపాలం మావయ్య రూపాయి కాసులవంక అనుమానంగా చూసి మళ్ళీ ఓసారి లెక్కపెట్టి తర్వాత మళ్ళీ పరిశీలనగా వాటి అక్షరాలవంకచూసి సమస్య తెగక పెళ్ళాన్నిపిలిచి,

“1949 సంవత్సరం రూపాయి కాసు ఒకటి వుండాలి, ఏమైంది?” అనడిగాడు.

“నెంబరెంత?” అనడిగింది భార్య.

“కాసు అంటూంటే” అన్నాడు గోపాలం మావయ్య.

“చిన్నదా? పెద్దదా?” నవ్వుతూ అంది మావయ్యపెళ్ళాం ఎగతాళిగా.

మావయ్య జ్ఞాపకశక్తిని ఇంతగా వూహించని గోపాలం ఆశ్చర్యపోయేడు. అది కాసు కావటంవల్ల నెంబర్ లేకపోయిందిగానీ వుంటే అదీ కరెక్టుగా చెప్పేసేవాడే. తనచేతిమీదుగా ఎన్నో వందరూపాయనోట్లు వాడాడుగానీ గోపాలం ఎప్పుడూ వాటినెంబర్వంక చూడనేలేదు. కనీసం ఆ దృష్టిఐనా లేదు తనకు. వెంటనే జేబు తడుముకున్నాడు గోపాలం.

మూడు పావలా బిళ్ళలు చేతికి తగిలాయ్. పైకితీసి వాటి వాటి సంవత్సరాలు చూశాడు. తమాషా మూడూ నలభైతొమ్మిదో సంవత్సరానివే! చాలాకాలంక్రితం ఓసారి ఈ కాసుల మీద సంవత్సరం ఎందుకువేస్తారో అర్థంకాని గోపాలానికి ఆ సంవత్సరం వుపయోగం యివ్వాళ తెలిసింది. దానివల్ల ప్రయోజనం ఎంత అనేదానికన్నా, మనదగ్గర మనకే తెలియని విషయాలు ఇల్లాంటివి కొన్ని వుంటయ్ అని తెలుసుకోగలిగిన గోపాలానికి మామయ్యని మెచ్చుకోవా

లనిపించింది. ఐతే మామయ్య చెప్పిన సంవత్సరం ఎంతవరకూ రైటో గానీ, గోపాలానికి తన జేబులో వున్న మూడు పావలాలూ అదే సంవత్సరంవి అవటంవల్ల తప్పకుండా అదికూడా అదే సంవత్సరంది ఐవుంటుందిలే అనుకొన్నాడు.

వ్యవహారం అంతటితో ముగిస్తే బాగానే వుండేది. కానీ అంత శ్రద్ధగావుండే గోపాలం మావయ్య రూపాయి ఎలా పోయిందో తెలుసుకోవటానికి ప్రయత్నించకుండా ఎలా వుండగలడు? ఐతే గోపాలానికి మావయ్య జ్ఞాపకశక్తిని మెచ్చుకోవాలనే అనిపించిందిగానీ, ఈ లోగానే మళ్ళీ మావయ్యమీద ఒళ్లుమండేటంత కోపం రావటంవల్ల, మెచ్చుకోకపోగా మావయ్య గొప్పతనాన్ని వెక్రికింద జమకట్టాడు.

తర్వాత మావయ్యని ఎలాగైనా ఓడించాలని గోపాలం చాలా చాలా ఆలోచించాడు. ఇంత జ్ఞాపకశక్తివున్న మావయ్యకి ఇనపపెట్టెలూ, ఇనప బీరువాలూ ఎందుకూ? అందుకని డబ్బంతా అల్మారులోనే వుంచేవాడు. రోజూ మాత్రం లెక్కచూసుకునేవాడు.

ఇంత జాగ్రత్తగా వుంటున్న మావయ్యని ఓడించటం ఎలాగో గోపాలానికి తోచక బుర్ర బద్దలు కొట్టుకున్నాడు.

ఓ రోజున మావయ్య చూడకుండా అల్మారులోంచి రెండు అర్ధలూపాయలు తీసి ఒక రూపాయి వేశాడు గోపాలం. సాయంత్రం మావయ్యడబ్బు లెక్కపెట్టుకుంటున్నప్పుడు అక్కడే పేపరు చదువుతూ ఏమీ తెలీనట్టు కూర్చున్నాడు. రెండుమూడుసార్లు లెక్కపెట్టి మావయ్య,

"ఏరా గోపాలం! చిల్లర కావాల్సి రెండు అర్ధరూపాయలు తీసుకొని రూపాయ పడేశావా ఏం?" అన్నాడు,

కారణం మావయ్య చెప్పింది కాకపోయినా, తను చేసినపనిని మావయ్య కనుక్కోగలిగినందుకు గోపాలానికి ఆశ్చర్యమేసింది. వెంటనే 'ఔను' అనకుండా కాసేపు ఒప్పుకోలేదు.

"వెధవది — చిల్లర కావాలంటే బజార్లో మార్చుకోలేనూ?" అన్నాడు గోపాలం.

పెళ్ళాంకూడా తనకి తెలియదన్న తర్వాతైనా మావయ్య మారతాడేమో అనుకొన్న గోపాలానికి మావయ్య మొండినమ్మకం చూసి ఆశ్చర్యమేసింది. నిజంగామనిషంటే మావయ్యేననిపించింది గోపాలానికి.

మావయ్య గొప్పతనానికి మనసులో అభినందన లర్పించుకున్నా, ఎలాగైనా ఓసారైనా మావయ్యని ఓడించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు గోపాలం.

ఆ రోజూ కూడా మావయ్య మామూలుగానే డబ్బు లెక్కపెట్టుకుంటున్నాడు. గోపాలం ఏమీ పట్టనట్టు పక్కనే కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. మావయ్య మొహంవొంక చూడాలనివున్నా, ఆ రోజుకూడా ఓడిపోవలసి వొస్తుందేమో అని భయపడి గోపాలం పేపర్లోనే దాక్కున్నాడు.

మావయ్యడబ్బంతా లెక్కపెట్టి, పెట్టెలో పెట్టుకుని, అల్మారులో పెట్టెనిపెట్టి బైటికొచ్చి గోపాలంతో బాతాఖానీ వేశాడు. గోపాలం మావయ్యతో మాట్లాడుతున్నాడన్న మాటేగానీ ఏం మాట్లాడున్నాడో తనకే తెలియటంలేదు. డబ్బు తేడా వొచ్చినట్టు ప్రకటించి మావయ్య తన మామూలు విజయాన్ని చాటడేం? ఇంకా చెప్తాడు, ఇంకా చెప్తాడు అని వూహిస్తున్న గోపాలానికి మావయ్య ఎంతసేపటికీ ఆ విషయం కదిలించక పోవటంవల్ల, మావయ్య ఓడిపోయాడనే సంతోషం ఒకపక్క పెరుగుతున్నప్పటికీ మావయ్యమీద తనకున్న ఒక నమ్మకం, గోపాలానికి క్రమంగా కరిగిపోసాగింది.

ఆగలేక గోపాలం అడిగాడు మామూలుగా,

"మావయ్యా-నీ డబ్బులో యివ్వాళ ఏమీ తేడా రాలేదా?"

మావయ్యా ఒక్క క్షణం బిత్తరపోయినా వాళ్ళు వెంటనే నిలవదొక్కుకుని "అబ్బే! లేదురా"

గోపాలం మనసులో నలభైతొమ్మిదో సంవత్సరం రూపాయి జాలిగా నాట్యంచేసింది.

గోపాలం రూపాయి, మావయ్య పెట్టెలో వున్న మిగతా రూపాయి ఏదో చెపుతున్నట్టు అనిపించి గోపాలం, అల్మారులో మూసివున్న పెట్టెకేసి వింతగా చూశాడు... అది గోపాలం రూపాయి.

★